
ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఆక్రమణకు గురైన స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పది కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించేందుకు ఓ ప్లాట్ యజమాని ఏకంగా ప్రహరీ నిర్మించాడు. అందులో గార్డెన్, స్విమ్మింగ్ పూల్ నిర్మించేందుకు ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12 ఎమ్మెల్యే కాలనీలోని సర్వే నంబర్ 102/పిలో ప్రభుత్వ స్థలం ఉంది. కాలనీలో ప్లాట్ నంబర్ 132కు చెందిన యజమాని తన ఇంటి వెనుక ఉన్న ఈ ప్రభుత్వ స్థలంపై కన్నేశాడు. ఎలాగైనా ఆక్రమించాలని పథకం వన్ని చుట్టూ ప్రహరీ నిర్మించాడు. ఆ తర్వాత స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. అయితే ఇటీవల రెవెన్యూ అధికారుల తనిఖీల్లో స్థలం ఆక్రమణకు గురైనట్లు తెలిసింది. షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఆక్రమణ వాస్తవమేనని నిర్ధారించుకొని సోమవారం ప్రహరీని కూల్చివేసి ప్రభుత్వ సూచిన బోర్డును ఏర్పాటు చేశారు.


విద్యార్థినులకు సైకిళ్లను అందజేస్తున్న సారిపల్లి కొండలరావు

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

అమీర్‌పేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లోని ప్రభుత్వ రౌండ్ టేబుల్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు మోడల్‌కాలనీలోని మానవ సేవా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సైకిళ్లను అందజేశారు. కాలనీలోని బృందావనం ఉద్యానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో గర్ల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమం ద్వారా ఐదుగురు ప్రతిభావంతులైన విద్యార్థినులకు వీటిని అందజేశారు. మోడల్‌కాలనీ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, మానవ సేవా ట్రస్ట్ ప్రతినిధులు దండా బుచ్చిబాబు, జేఎస్టీ సాయి, శశికాంత్, కాలనీ ప్రతినిధులు కె.ఎస్.రావు, అమ్ములు, శశికాంత్ పాల్గొన్నారు.

రేపు కామర్స్ టాలెంట్ టెస్ట్

ఖైరతాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) ఆధ్వర్యంలో కామర్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు కామర్స్ ప్రాథమిక అంశాలు, అకౌంటెన్సీ, ఎకనామిక్స్, ఐటీ, జనరల్ నాలెడ్జిలలో మేధస్సును పరీక్షించేందుకు అంబిషన్స్ కెరీర్ కౌన్సెలర్స్ వాసవీ క్లబ్‌ల సహకారంతో టెస్ట్ నిర్వహిస్తున్నామన్నారు. 29న మధ్యాహ్నం 2 గంటలకు లక్డీకాపూల్‌లోని ఐఐఎంసీ కళాశాలలో పరీక్ష ఉంటుందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటల నుంచి పరీక్ష రాసేందుకు పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వివరాలకు 9052810304, 9493976082లలో సంప్రదించాలని సూచించారు.


జూబ్లీహిల్స్ వార్డు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వీధి దీపాల విభాగం సిబ్బంది

జీతాలు చెల్లించాలని నిరసన

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని.. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలంటూ వీధి దీపాల విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది కోరారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న వీధి దీపాల విభాగం ఎనర్జీ ఎఫీషియన్సీ సేవింగ్ సర్వీసెస్ లిమిటెడ్ కింద పనిచేస్తున్న సిబ్బంది సోమవారం జూబ్లీహిల్స్‌లోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తమకు జీతాలు రావడం లేదని, ఎంత మంది అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులను అడిగితే సంబంధిత ఏజెన్సీనే అడగాలని చెప్పారని, ఏజెన్సీ వద్దకు వెళ్తే తమకు బిల్లులు రాకుండా జీతాలు ఎలా చెల్లిస్తామంటున్నారని చెప్పారు. జీహెచ్‌ఎంసీలోని ఒక్కో సర్కిల్‌లో వీధి దీపాల విభాగంలో 13 మంది సిబ్బంది ఉంటారని, ఈ సమస్యను త్వరలోనే సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, ప్రదీప్, సురేందర్, కృష్ణ వాజీద్, వెంకట్, హరి తదితరులు పాల్గొన్నారు.

అభినందన


ఐసీసీ ఛాంపియన్ ట్రోఫీ భారత క్రికెట్ మేనేజర్‌గా నియమితులైన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి దేవరాజ్‌ను అభినందిస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

- బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)


గచ్చిబౌలిలో జరిగిన జేకేఏ ఇన్విటేషన్ ఇంటర్నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన షేక్ ఆజంను బీఆర్‌ఎస్ భవన్‌లో సత్కరించి అభినందిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, మన్నె గోవర్ధన్‌రెడ్డి

- ఖైరతాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి)

స్ఫూర్తినిచ్చేలా డే కేర్ సెంటర్

- వృద్ధుల కోసం ప్రత్యేక అసోసియేషన్
- క్రీడా వసతులతో పాటు లైబ్రరీ సదుపాయం

- ప్రత్యేక దినాల్లో సాంస్కృతిక ప్రదర్శనలు
- ఆదర్శంగా నిలుస్తోన్న మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్


హుషారుగా పరుగులు తీస్తూ..


చదరంగం ఆడుతున్న సీనియర్ సిటిజన్స్

అమీర్‌పేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆటపాటలతో పాటు నిరంతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న మోడల్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సంకల్ప సిద్ధికి వయోభారం అడ్డుకాదని నిరూపిస్తున్నారు. అసోసియేషన్ కేంద్రంగా కొనసాగుతున్న డే కేర్ సెంటర్ (సీనియర్ సిటిజన్స్ కేంద్రం) ఎంతో ఆదరణ పొందుతోంది. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలోని మోడల్‌కాలనీలో వయోధికులంతా కలిసి అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలు

సీనియర్ సిటిజన్ల ఆసక్తికి అనుగుణంగా క్యారమ్స్, చదరంగం తదితర క్రీడా వసతులను ఇక్కడి డే కేర్ సెంటర్‌లో కల్పించారు. చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వృద్ధులు సుమారు 40 మందికి పైగా ఇక్కడకు వస్తుంటారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ధ్యానం చేసుకోవడం, ఆటలు ఆడటం చేస్తుంటారు. ఇక్కడి కేంద్రంలో గ్రంథాలయం కూడా ఉంది. దినపత్రికలు, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక గ్రంథాలు, కథలు, విజ్ఞానాన్ని పెంచే పుస్తకాలు సుమారు 2 వేల వరకు అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రానికి హాజరయ్యే వృద్ధుల కోసం ప్రసంగ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. ఇక పండుగలు, ఉత్సవాల రోజుల్లో ఆహ్లాదకరమైన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ వారిలో ఉత్సాహం నింపుతుంటారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం ఈ కేంద్రానికి సహకారం అందిస్తుంటారు.


సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నిష్ణాతుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు

అసోసియేషన్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, ప్రధాన కార్యదర్శి జేఎస్‌టీ సాయి పర్యవేక్షణలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన సీనియర్ సిటిజన్లను సన్మానించడం, వారి అనుభవాలను పంచుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. ఆటల పోటీలు, క్విజ్, జనరల్ నాలెడ్జ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తుంటారు. అసోసియేషన్ కార్యక్రమాలు స్ఫూర్తిగా నిలుస్తుండటంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు డే కేర్ సెంటర్ నిర్వాహకులను తరుచూ సన్మానించడం విశేషంగా చెప్పవచ్చు.

సువాసనలు వెదజల్లే పార్క్

మోడల్‌కాలనీ మధ్యలో ఏర్పాటు చేసిన సుందరమైన పార్క్ ఆహ్లాదాన్ని అందించడంతో పాటు సువాసనలు వెదజల్లుతోంది. పార్క్‌లో భారీగా పెరిగిన చెట్ల మధ్య సీనియర్ సిటిజన్లు, వాకర్స్ సేద తీరుతుంటారు. వన ప్రేమికులైన కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఇక్కడి పార్కులో నాటిన మల్లె, మందార, గులాబీ, సన్నజాజి, పారిజాత, అశ్వగంధ, మారేడు, లైట్ క్వీన్, డే క్వీన్, రాధ, మాధవి, గన్నేరు, కనకాంబ్రాలు, బంతి, చామంతి మొక్కలు వెదజల్లుతున్న సువాసనలను కాలనీవాసులు ఆస్వాదిస్తున్నారు.


మోడల్ కాలనీ పార్కు

సినీ ఇండస్ట్రీకి ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

బంజారాహిల్స్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ ఇండస్ట్రీకి తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం డబ్బింగ్ థియేటర్ నిర్వాహకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సినీ కళాకారులు, కార్మికుల శ్రేయస్సుకు నిరంతరం కృషి చేస్తున్నామని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు వచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. దేశంలోనే తెలుగు సినీ పరిశ్రమకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని, వాటిని మరింతమెరుగుపర్చుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సినిమా ఇండస్ట్రీని మరింత విస్తరించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలోనే వాటి వివరాలను వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మణికొండ మున్సిపల్ ఛైర్మన్ నరేంద్ర, సినీ నిర్మాతల మండలి ప్రెసిడెంట్ దామోదర్ ప్రసాద్, తెలంగాణ ఫిలిం ఛాంబర్ సెక్రటరీ అనుపమ రెడ్డి, ఫిలిం ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్, నల్గొండ డీసీఎంఎస్ ఛైర్మన్ బొల్లా వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి కోమటిరెడ్డిని కలిసిన సినీ పరిశ్రమకు చెందిన కార్మిక యూనియన్ నాయకులు

మా ప్లాట్లను కబ్జా చేస్తున్నారు

- ప్రభుత్వం న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

పంజాగుట్ట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం కొర్రెముల గ్రామం ఏకశిలానగర్ కాలనీలోని తమ ప్లాట్లను భూ మాఫియా కబ్జా చేయాలని చూస్తోందని పలువురు బాధితులు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు జుబేర్ అక్రమ్, రాంరెడ్డి, చెరుకు శివారెడ్డి, ముత్తారెడ్డి, తదితరులు మాట్లాడారు. వివిధ శాఖలలో ప్రభుత్వ ఉద్యోగాలు చేసిన తామంతా 1985లో కొర్రెముల గ్రామంలో ప్లాట్లు కొనుగోలు చేసినట్లు వారు తెలిపారు. అయితే కొందరు కబ్జాదారులు నకిలీ పత్రాలను సృష్టించి తమ స్థలాలను వ్యవసాయ భూములుగా చూపుతూ అధికారుల సాయంతో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. తామంతా హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా ఆదేశాలు వచ్చాయని, అయితే న్యాయస్థానం ఆదేశాలను సైతం లెక్క చేయకుండా తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లను సైతం నేలమట్టం చేశారని వాపోయారు. బాధితుల పక్షాన నిలవాలని కోరడంతోనే స్థానిక ఎంపీ అక్కడికి వచ్చారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏకశిలానగర్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి జుబేర్ అక్రమ్

మానసిక రుగ్మతలకు సీబీటీతో మెరుగైన చికిత్స

- ప్రొ. నరసింహారెడ్డి

ఎర్రగడ్డ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువతలోని మానసిక ఆరోగ్య రుగ్మతలకు సీబీటీ (కాగ్నిటివ్ బిహేవియరల్ తెరపీ) మెరుగైన చికిత్స విధానమని ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి పూర్వ విద్యార్థి, న్యూజెర్సీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్. నరసింహారెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగడ్డలోని ఆస్పత్రిలో మానసిక ఆరోగ్య సమస్యలకు సీబీటీ చికిత్స విధానం, పరిష్కారం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు వందమంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చదువు, ఉద్యోగాల మూలంగా యువతలో పెరుగుతున్న ఒత్తిడికి ఈ చికిత్స విధానం మెరుగైనదన్నారు. ఈ విధానం యువతతో పాటు ఇతర వయసుల వారిపై సైతం ప్రభావవంతంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ రెడ్డి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల, వైద్యులు సుధారాణి, పద్మజ, వెంకట సుబ్బయ్య, వివస్వాన్, రమేష్, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ నరసింహారెడ్డి తదితరులు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అల్లం నారాయణ, సూర్యకిరణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, డైరెక్టర్ శంకర్, అద్దంకి దయాకర్ తదితరులు

31న గద్దర్ జయంతి వేడుకలు

పంజాగుట్ట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, గద్దర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 31న రవీంద్రభారతిలో గద్దర్ 77వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, కార్యదర్శి జీవీ సూర్యకిరణ్, మీడియా అకాడమీ మాజీ ఛైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, ప్రముఖ దర్శకుడు శంకర్, కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ జయంతి వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ చిదంబరం తదితరులు పాల్గొంటారని వారు వెల్లడించారు.

బస్సులో సెల్‌ఫోన్ల చోరీ.. అనుమానితుల అరెస్ట్

ఖైరతాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో సెల్ ఫోన్లు చోరీ చేస్తున్నారనే అనుమానంతో ముగ్గురిని సైఫాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సచివాలయం బస్టాప్ వద్ద సెల్ ఫోన్లు చోరీ చేస్తున్నారంటూ ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ మహిళ గట్టిగా అరవడంతో డ్రైవర్ బస్సు ఆపాడు. దీంతో వెంటనే ముగ్గురు యువకులు బస్సు దిగి పారిపోతుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిని అనుమానితులుగా భావిస్తూ విచారిస్తున్నామని, పోలీసుల అదుపులో ఉన్న వారు హైదరాబాద్ నగరానికి చెందిన వారేనని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


వేలం ప్రక్రియలో పాల్గొన్న సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితామూర్తి తదితరులు

సీజ్ చేసిన వాహనాలకు వేలం

- రూ. 56.10 లక్షల ఆదాయం

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో సీజ్ చేసిన వాహనాలను సిటీ పోలీసులు గోషామహల్ స్టేడియంలో వేలం వేశారు. ఈ వేలం ద్వారా ఖజానాకు రూ. 56.10 లక్షల ఆదాయం సమకూరింది. సీఏఆర్ (కార్) హెడ్ క్వార్టర్స్ డీసీపీ రక్షితామూర్తి తెలిపిన వివరాల మేరకు.. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, ఇతర వాహనాల చెకింగ్, నేరస్థుల వద్ద పోలీసులకు పట్టుబడ్డ అనధికారిక వాహనాలను పోలీసులు సీజ్ చేసి గోషామహల్ స్టేడియంకు తరలించారు. కొన్నేళ్ల పాటు వాటిని సంబంధిత యజమానులు తీసుకెళ్లకపోవడం, సరైన పత్రాలు, ఆధారాలు లేని వాహనాలు ఏళ్లతరబడి తుక్కుగా మారిపోవడంతో వాటిని వేలం వేయాలని పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఎవరైనా వాహనదారులు సంబంధిత పత్రాలు చూపించి తీసుకెళ్లాల్సిందిగా నోటీసులు జారీ చేసినా ఎవరూ స్పందించలేదు. ఇదిలా ఉండగా.. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించి, అక్కడ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో గోషామహల్ స్టేడియంను ఖాళీ చేయాల్సి రావడంతో తుక్కుగా మారిపోయిన వాహనాలను వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ బిడ్డింగ్‌లకు ఆహ్వానించగా ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన 150 మంది వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 537 వాహనాల్లో బైక్‌లు-355, ఆటోలు-70, ఫోర్ వీలర్స్-102, భారీ వాహనాలు-10 కలిపి సుమారు 5 టన్నుల స్క్రాప్‌ను వేలంలో విక్రయించారు. దాంతో ప్రభుత్వ ఖజానాకు రూ. 56,10,000ల ఆదాయం వచ్చినట్లు డీసీపీ తెలిపారు.

గంజాయి స్మగ్లర్‌గా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- వారానికోసారి నగరానికి వచ్చి విక్రయాలు
- ఆటకట్టించిన ఎక్సైజ్ పోలీసులు
- రూ. 1.91 లక్షల విలువైన సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి వారం వారం నగరానికి వచ్చి.. కస్టమర్స్‌కు గంజాయి, ఓజీ కుష్ (మేలు రకం గంజాయి)ని కస్టమర్స్‌కు సరఫరా చేసి వెళ్తున్న సాఫ్ట్‌వేర్ గంజాయి స్మగ్లర్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద రూ. 1.91 లక్షల ఒక కేజీ పొడి గంజాయి, 175 గ్రాముల ఓజీ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. తూర్పుగోదావరికి చెందిన శివరామ్ బెంగళూరులోని డెలాయిట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. గంజాయికి అలవాటుపడిన శివరామ్, బెంగళూరులో అజయ్ అనే గంజాయి స్మగ్లర్ వద్ద పొడి గంజాయి, ఓజీ గంజాయి కొనుగోలు చేసి బస్సులో బయల్దేరి నగరానికి వస్తాడు. ఇక్కడున్న కస్టమర్స్‌కు గుట్టుగా సరుకును అందజేసి, డబ్బులు వసూలు చేసుకొని తిరిగి బెంగళూరు వెళ్తాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్‌కు ఎక్సైజ్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దాంతో శివరామ్ బెంగళూరు నుంచి వచ్చి రాయదుర్గం, గచ్చిబౌలి ప్రాంతాల్లో సరుకును విక్రయిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా.. బెంగళూరులో ఓజీ గంజాయిని ఒక గ్రాముకు రూ. 1500కు కొనుగోలు చేసి, నగరంలో 3 వేల రూపాయలకు విక్రయిస్తున్నట్లు తేలింది. అనంతరం పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10 సింగాడిబస్తీలో నివసించే మహ్మద్ మోసిన్ సిద్దిఖీ ఆటో డ్రైవర్. అతడు బస్తీలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నాడు. రిపబ్లిక్ డే సందర్భంగా అమ్మకాలు చేస్తున్నట్టు సమాచారం అందడంతో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మోసిన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు 31 మద్యం సీసాలతో పాటు రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ లోన్ పేరుతో సైబర్ మోసం

- ఉపాధ్యాయురాలి నుంచి రూ.5.50 లక్షల వసూలు

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో లోన్ కోసం ప్రయత్నిస్తున్న ఉపాధ్యాయురాలిని మభ్యపెట్టిన సైబర్ నేరగాడు ఆమె నుంచి రూ.5.50 లక్షలు వసూలు చేశాడు. నగరానికి చెందిన ఉపాధ్యాయురాలు (57) ఆర్థిక అవసరాల నేపథ్యంలో లోన్ తీసుకోవాలని భావించింది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో రుణం ఇచ్చే సంస్థల కోసం వెతకగా ఓ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి మహేష్ పేరుతో సైబర్ నేరగాడు ఆమెను సంప్రదించాడు. ఆమె వివరాలు తీసుకుని లోన్ ప్రాసెసింగ్ ఫీజు పేరుతో పలు దఫాలుగా రూ.5.50 లక్షలు తాను సూచించిన ఖాతాల్లో జమ చేయించుకున్నాడు. ఎన్నిసార్లు డబ్బు ఇచ్చినా తిరిగి డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో లోన్‌లు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.



వలంటీర్లతో హుస్సేన్‌సాగర్ గట్టుపై చెత్తను తొలగిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్ సుచిత్ర

హుస్సేన్‌సాగర్‌పై పరిశుభ్రత కార్యక్రమం

రాంగోపాల్‌పేట్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెరువు పరిసరాల్లో పరిశుభ్రత కోసం పని చేయడం అభినందనీయమని రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర అన్నారు. సోమవారం పీవీ మార్గ్‌లోని హుస్సేన్ సాగర్ గట్టుపై ఉన్న చెత్తను ఎసెజ్ వరల్డ్ మిషన్ సొసైటీ చర్చ్ ఆఫ్ గాడ్ యూనివర్సిటీ విద్యార్థి వలెంటీర్ల బృందం సోమవారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రపంచవ్యాప్త పరిశుభ్రత క్యాంపెయిన్‌లో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతతో కలిసి సుచిత్ర పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పరిశుభ్రత కార్యక్రమంలో చేపట్టడం శుభపరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి పియూష్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



కవి సిద్ధార్థను సత్కరిస్తున్న కె.శ్రీనివాస్, మామిడి హరికృష్ణ

సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుంది

రవీంద్రభారతి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి సిద్ధార్థ కవిత్వం తెలంగాణ అస్థిత్వాన్ని ప్రతిబింబిస్తుందని సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జమిలి సాహిత్య సాంస్కృతిక, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కవి సిద్ధార్థ సాహిత్య సమాలోచన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కవి సిద్ధార్థ ప్రతి కవితలో తాత్విక ధోరణితో నింపుతూనే అవసరాన్ని బట్టి ధిక్కార స్వరాన్ని వినిపిస్తాడని అన్నారు. తన చుట్టూ ఉన్న మనుషులు, వారితో ఉన్న అనుబంధాలను అక్షరూపంలో పెడతాడని కొనియాడారు. సిద్ధార్థ పదాల్లో నేలతనం ఉట్టిపడుతుందని పేర్కొన్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ మాట్లాడుతూ ప్రపంచీకరణ తొలిదశ నుంచి నేటి వరకు తెలంగాణలో వచ్చిన, వస్తున్న మార్పులను, అస్థిత్వ వాదాలను తన కవిత్వంలో చూపించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ జర్నలిస్టు బుచ్చన్న, యువకవి ఆదిత్య, అంబటి సురేంద్ర, అక్షరకుమార్ తదితరులు పాల్గొన్నారు. చివరగా స్పందిస్తూ కవి సిద్ధార్థ మాట్లాడుతూ తన కవిత్వం గురించి గొప్పసభ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కవిత్వం నా కులవృత్తి నేను రాయడం మానను అంటూ ఉపన్యసించారు.

పాన్‌మసాలా వ్యాపారి హత్య కేసులో నలుగురి అరెస్ట్

మారేడుపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కార్ఖానా విక్రంపురి ప్రాంతానికి చెందిన బొల్ల రమేష్ (52) అనే పాన్ మసాలా వ్యాపారిని ఈ నెల 18న అర్ధరాత్రి దాటాక హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను కార్ఖానా పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సజ్జాద్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు ఈ నెల 18న ఆయన వద్దకు వెళ్లి పెద్ద ఎత్తున పాన్‌మసాలా కొనుగోలు చేశారు. ఈ సరుకుకు సంబంధించిన డబ్బు ఇస్తామంటూ రమేష్‌ను కాచిగూడకు పిలిచి కారులో తీసుకువెళ్లారు. సాయంత్రం వరకు తమతోనే ఉంచుకుని అతడిని బెదిరించి ఆన్‌లైన్‌లో రూ.15 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. మరింత డబ్బు కావాలని బెదిరిస్తూనే తమ బండారం ఎక్కడ బయటపడుతుందోనని భయపడి అతడిని హత మార్చాలని నిర్ణయించుకున్నారు. చేతులను తాడుతో కట్టి గొంతు కోసి హత్య చేశారు. అనంతరం రమేష్ మృతదేహాన్ని నిందితులు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి రోడ్డు పక్కన కూసుమంచి మండలంలో ఓ మిరపతోటలో పడేశారు. కాగా, ఈ నెల 19న రమేష్ కనిపించడం లేదని అతడి భార్య కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్నారు. సాంకేతిక సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టి హత్య చేసిన నలుగురు నిందితులను గుర్తించారు. 24వ తేదీన హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సాజిద్ (45)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు నిందితులు సంతోష్ నగర్‌కు చెందిన మొహమ్మద్ పర్వేజ్ (35), హయత్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ అజీమ్ (35), సంతోష్‌నగర్‌కు చెందిన మీర్జా (42)లను కార్ఖానా పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బోయిన్‌పల్లిలో వ్యక్తి మృతిపై
వైద్యుడిని విచారించిన పోలీసులు

బోయిన్‌పల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలో వీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. మధుసూదన్‌గౌడ్‌కు వైద్యం చేసిన బీహెచ్‌ఎంఎస్ వైద్యుడు ప్రసన్నకుమార్‌ను సోమవారం బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఆస్పత్రి యాజమాన్యం ఆదేశాల మేరకు వేరే డ్యూటీ డాక్టర్ ఫోన్‌లో సూచనలు చేయగా ఆ మేరకు మధుసూదన్‌గౌడ్‌కు వైద్యం చేసినట్లు వెల్లడించాడు. ప్రసన్నకుమార్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆస్పత్రికి అనుమతిపై, జీహెచ్‌ఎంసీ, బాలానగర్ నుంచి వైద్యాధికారులు ఎందుకు వచ్చారనే దానిపై సికింద్రాబాద్ కంటోన్మెంట్ అధికార యంత్రాంగం, మిలిటరీ ఆస్పత్రి వైద్యాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రి కంటోన్మెంట్ పరిధిలో ఉంది. జీహెచ్‌ఎంసీ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే దానిపై మిలిటరీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెడికల్ ఆఫీసర్, తిరుమలగిరి మెడికల్ సూపరింటెండెంట్, బొల్లారం అధికారులు ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలిసింది.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

బంజారాహిల్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10 సింగాడిబస్తీలో నివసించే మహ్మద్ మోసిన్ సిద్దిఖీ ఆటో డ్రైవర్. అతడు బస్తీలో అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యం అమ్ముతున్నాడు. రిపబ్లిక్ డే సందర్భంగా అమ్మకాలు చేస్తున్నట్టు సమాచారం అందడంతో బంజారాహిల్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. మోసిన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు 31 మద్యం సీసాలతో పాటు రూ.2,600 నగదు స్వాధీనం చేసుకున్నారు.

సోదరుడితో గొడవపడి వ్యక్తి అదృశ్యం



శంకర్‌దూత్

రాంగోపాల్‌పేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సోదరుడితో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగుట్టకు చెందిన శంకర్‌దూత్ (38) ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తూ తన సోదరుడు బ్రిజ్‌గోపాల్ దూత్‌తో కలిసి నివసిస్తున్నాడు. శంకర్‌దూత్ తాను పనిచేసే చోట ఉద్యోగం వదిలి వేరే దగ్గర పనిచేయడం మొదలుపెట్టాడు. ఈ విషయంలో సోదరుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో శంకర్‌దూత్ ఈ నెల 20న ఇంట్లో ఉన్న 4వేల రూపాయలను తీసుకుని వెళ్లిపోయాడు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

అమలు కాని ప్లాస్టిక్ నిషేధం

- యథేచ్ఛగా వాడకం
- పట్టించుకోని అధికారులు
- శివార్లలో వందల సంఖ్యలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల యూనిట్లు

రాంగోపాల్‌పేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ ప్రభుత్వం నిషేధించి దశాబ్దం కావస్తున్నా.. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. 40 మైక్రాన్ల లోపు మందం ఉండే ప్లాస్టిక్ కవర్లను ప్రభుత్వం నిషేధించింది. అయితే, దానిని అమలు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. దీంలో 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు కలాసీగూడ, జనరల్‌బజార్, నల్లగుట్ట, మోండా మార్కెట్ తదితర ప్రాంతాల్లో వ్యాపారులు ఇతరులు యథేచ్ఛగా వాడుతున్నారు. నిషేధాన్ని అమలు చేయాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. ప్రజల నుంచి సేకరించే చెత్తలో 40 మైక్రాన్ల కంటే మందం తక్కువగా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల వందల సంఖ్యలో క్యారీ బ్యాగుల తయారీ యూనిట్లు ఉన్నాయి. ఇక్కడ తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు తయారు కాకుండా చూడాల్సిన బాధ్యత పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జీహెచ్‌ఎంసీ యంత్రాంగంపై ఉంటుంది. ఆయా శాఖల అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో తక్కువ మందం కలిగిన క్యారీ బ్యాగులు మార్కెట్లలో యథేచ్ఛగా లభిస్తున్నాయి.



మినర్వా కాంప్లెక్స్ డౌన్‌లో ప్లాస్టిక్ కవర్లతో నిండిన చెత్త



కళాసీగూడలో ప్లాస్టిక్ కవర్లతో నిండిన వ్యర్థాలు

నామమాత్రపు దాడులు

నిషేధిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నామమాత్రపు దాడులతో సరిపెడుతుండటంతో ప్లాస్టిక్ వాడక పెరిగిపోతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు తక్కువ మందం గల ప్లాస్టిక్ బ్యాగులు తయారీ కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి



ప్లాస్టిక్ నిషేధంపై కొత్తలో ప్రజలకు అవగాహన కల్పించడానికి నామమాత్రపు కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత వాటినీ పక్కన పెట్టేశారు. ఇటు ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్లపై నిషేధం ఉన్న విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలి. దుకాణాలకు వెళ్లినప్పుడు ఇంటి నుంచే జ్యూట్, వస్త్రంతో తయారు చేసిన సంచులను వెంట తీసుకెళ్లాలి. ప్లాస్టిక్ వాడని వారికి ప్రభుత్వం గుర్తించి ప్రోత్సాహకాలు అందించాలి.

\- ఎస్‌ఆర్‌కే ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు

ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, జీవాలకు నష్టం



ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మూగజీవాల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుంది. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు ఒక్కసారి వాడి పారవేస్తుంటారు. దీంతో వాటి రసాయనాలు మట్టిని కలుషితం చేస్తాయి. చాలా మంది ఆహారాన్ని ప్లాస్టిక్ కవర్లలో వేసి పారవేస్తుంటారు. ఆ విషయం తెలియక మూగజీవాలు ఆహారంతో పాటు వాటిని తిని రోగాల బారిన పడుతున్నాయి. ఆవులు, బర్రెలు వీటిని తిని విషపూరితమైన పాలు ఇస్తున్నాయి. వాటిని తాగి మనుషులకు కూడా రోగాల బారిన పడుతున్నారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలి.

\- మక్తాల జలందర్‌గౌడ్, మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు

మూడోసారి దొరికితే..



120 మైక్రాన్ల కన్నా తక్కువ మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్లను, క్యారీ బ్యాగులను వాడరాదు. గతంలో 20, 30, 40, 50 మైక్రాన మందం గల ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం ఉండేది ప్రస్తుతం 120 మైక్రాన్ల వరకు నిషేధం వర్తిస్తుంది. 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వినియోగిస్తూ మొదటిసారి దొరికితే 500 రూపాయల జరిమానా. రెండోసారి దొరికితే రూ.2 వేలు, మూడవ సారి దొరికితే రూ.5 వేలు జరిమానా విధిస్తున్నాం. మళ్లీ దొరికితే వారి వ్యాపారాన్ని సీజ్ చేస్తాం. 120 కంటే తక్కువ మైక్రాన్ల ప్లాస్టిక్ కవర్ల తయారీ వద్దనే కట్టడి చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

\- ఎస్.వెంకటేష్, ఏఎంహెచ్‌ఓ బేగంపేట సర్కిల్

ప్రజలకు ఇబ్బంది కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ వ్యాపారుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. సోమవారం పద్మారావునగర్‌లో ఫుట్‌పాత్ వ్యాపారులు, పార్క్ అభివృద్ధి కమిటి, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ఫుట్‌పాత్‌లపై చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. స్పష్టమైన మార్గదర్శకాలతో వ్యాపారాలు నిర్వహించుకొనే వెసులుబాటు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పలు కాలనీ సంఘాలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ... రోడ్లపై ఇష్టానుసారంగా వ్యాపారాలు చేస్తూ, కాలనీ దారులను సైతం ఆక్రమించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. స్పందించిన తలసాని ప్రజల ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు చేసుకోవాలని, త్వరలోనే గుర్తింపు కార్డులను జారీ చేస్తామని తెలిపారు. ట్రాఫిక్ పోలీసు అధికారుల సూచనల ప్రకారమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, జలమండలి జీఎం వినోద్, ఉద్యానవనశాఖ అధికారి గణేశ్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి బాలరెడ్డి, లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

వీధి వ్యాపారుల పోరాటానికి మద్దతు తెలపాలని కోరుతూ.. జాతీయ వీధి వ్యాపారుల సమాఖ్య సికింద్రాబాద్ శాఖ అధ్యక్షుడు జేమ్స్‌జాన్ సోమవారం పద్మారావునగర్‌లో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. బాల్‌రాజ్‌యాదవ్, శైలేందర్, కృష్ణ ముదిరాజ్, అశోక్, ఏసూరి మహేశ్, శ్రీకాంత్‌రెడ్డి, ముక్కా శ్రీనులు పాల్గొన్నారు.

సమరయోధుల విగ్రహాల ముందు ఫ్లెక్సీలను తొలగించాలి



జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న సాయిప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలో పలు ప్రాంతాలతో పాటు వారాసిగూడ చౌరస్తాలోని స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం ముందు ఫ్లెక్సీలను తొలగించాలని బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ పి.సాయిప్రసాద్‌గౌడ్, జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాల ముందు పలు పార్టీల నేతలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారని, దీంతో ఆ విగ్రహాలు కనిపించడం లేదని ఉపకమిషనర్‌కు వివరించారు. వ్యక్తిగత ఫొటోలతో పాటు అన్నిపార్టీల ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని కోరారు. అనంతరం పార్శిగుట్ట న్యూఅశోక్‌నగర్ సేవాసంఘం కమ్యూనిటీహాల్‌కి డ్రైనేజీ లైన్‌ను వేయాలని, అంబర్‌నగర్ బస్తీలో తవ్విన రోడ్ల స్థానంలో నూతన రోడ్లును నిర్మించాలని కోరారు. నర్సింగరావు, మనీ, ఉపేంద్రబాబు తదితరులున్నారు.

శ్రీనివాస్‌నగర్‌లో నీటి సమస్యలను పరిష్కరిస్తా



శ్రీనివాస్‌నగర్‌లో వాటర్‌పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస్‌నగర్‌లో నీటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ సామల హేమ అన్నారు. సోమవారం శ్రీనివాస్‌నగర్ మెథడిస్ట్ చర్చి వద్ద వాటర్ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సుమారు పదిహేను లక్షల రూపాయల వ్యయంతో పనులను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. బస్తీల్లో సమస్యలుంటే తనదృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం విద్యాసాగర్, మేనేజర్ నవ్య, నాయకులు శైలేందర్, జాకీర్, కృష్ణ, ఖరీంలాలా, లక్ష్మీ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగికి 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డును అందజేస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం, ఏజీఎం తదితరులు

దక్షిణ మధ్య రైల్వే 'అనిమిషా' యాప్ ఆవిష్కరణ

- రైల్వే ఉద్యోగులకు అందుబాటులో విజిలెన్స్ సమాచారం
- జీఎం అరుణ్‌కుమార్ జైన్

హైదరాబాద్ సిటీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజిలెన్స్ యాప్ 'అనిమిషా'ను జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆవిష్కరించారు. సోమవారం రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా రైల్వేబోర్డుకు సంబంధించిన విజిలెన్స్ సర్క్యులర్లు, మాన్యువల్స్, పని విధానంలో నూతన ఒరవడులు, రైల్వే క్రమశిక్షణ, అప్పీల్, ప్రవర్తన నియమాలు, అవినీతి నిరోధక చట్టం సంబంధిత సమస్త సమాచారాన్ని ఉద్యోగులు, అధికారులు తెలుసుకోవచ్చన్నారు. భద్రతా విధానాలను తప్పనిసరిగా పాటించాలని, సరుకును సరైన లోడింగ్, అన్‌లోడ్ చేయడంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. డివిజన్ల వారీగా భద్రతా పరికరాల నిల్వ స్థితిగతులపై ఆరా తీశారు. అవసరమైన చోట తగినంత నిల్వలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం వివిధ స్థాయిల్లో ఉత్తమ పనితీరును ప్రదర్శిస్తున్న సిబ్బందికి 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డులను అందజేసి, వారికి అభినందనలు తెలిపారు.



బోయిన్‌పల్లి సీతారాంపురంలో పర్యటిస్తున్న కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

ప్రజల సమస్యలు పరిష్కరిస్తా: రామకృష్ణ

బోయిన్‌పల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ ప్రజల కష్టసుఖాల్లో తోడుంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని ఆరో వార్డు సీతారాంపురం, శ్రీనివాసకాలనీవాసుల ఫిర్యాదుల మేరకు ఆయా కాలనీల్లో సోమవారం పర్యటించారు. ఈ నేపథ్యంలో స్థానికంగా నెలకొన్న సమస్యలను కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను వంద శాతం పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వారో వార్డు బీజేపీ అధ్యక్షుడు ప్రతీక్‌జైన్, సీనియర్ నాయకులు అజయ్‌గౌడ్, స్థానికులు స్వరూప, డాక్టర్ రజనీకాంత్, గోపాల్‌గౌడ్, ప్రవీణ్‌యాదవ్, నందగౌడ్, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, సంజీవ్, చంద్రమౌళి, నాగరాజు, బీజేపీ నాయకులు ప్రశాంత్ ప్రభు, శంకర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే శ్రీగణేష్

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి

- కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచన
- ప్రమాణస్వీకారం చేసిన చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు

బోయిన్‌పల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో అతిపెద్ద కూరగాయల మార్కెట్‌గా గుర్తింపు పొందిన బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మార్కెట్ యార్డు ఉన్నతశ్రేణి అధికారి వెంకన్న ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా చైర్మన్ ఆనంద్‌బాబుతో, ఆ తరువాత వైస్ చైర్మన్ డి.బి.దేవేందర్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మార్కెట్ కమిటీ సభ్యులు సాయిశరత్, దోమల సంతోష్‌కుమార్, సంతు జూలియస్, సీఎం రామన్, బూచనపల్లి కృష్ణారెడ్డి, కాసారం దుర్గేశ్ గౌడ్, సిద్దాపురం ఆకాష్ రెడ్డి, అజాజ్ పాషా, నల్లోళ్ల రాజేందర్, అస్లామ్ సోఫీ, ఎల్.ఎ గౌతం, ఎస్.ప్రభాకర్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేయాలని, అందుకోసం తాను కూడా సహకారం అందిస్తానన్నారు. మార్కెట్‌లో కూరగాయల దుకాణాల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి వేరే స్థలంలో కేటాయిస్తామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి విధేయులుగా పనిచేసిన వారిని పదవులు వరిస్తాయని ఆయన పేర్కొన్నారు.



విజేతలకు ట్రోఫీలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుమలగిరి జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అరవింద్ యువతకు క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రిపబ్లిక్ డేను పురస్కరించుకుని నాలుగు రోజుల పాటు బొల్లారం రీడింగ్ రూంలో నిర్వహించిన స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో విజేతలకు సోమవారం ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. ఆటలతో దేహదారుఢ్యంతో పాటు మేధా సంపత్తి పెరుగుతుందన్నారు. బొల్లారం క్రీడలకు పుట్టినిల్లు అని, ఈ ప్రాంతం నుంచి వివిధ క్రీడలకు ఎందరో జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, సతీష్, రషీద్, గాంధీ, చంద్రశేఖర్, హరీష్, విష్ణు పాల్గొన్నారు.

తాను మరణించినా మరొకరికి వెలుగు



పద్మారాణి (ఫైల్)

చిలకలగూడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆసుపత్రిలో చీఫ్ ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన పద్మారాణి(59) తన కళ్లను దానం చేశారు. పద్మారాణి కోరిక మేరకు ఆమె నేత్రాలను వాసన్ ఐ బ్యాంక్‌కి అందజేశారు. ఆమె కవి, రచయిత, కార్టూనిస్ట్‌గా వివిధ పత్రికల్లో పని చేశారు. భర్త రాంబాబు లాలాగూడ వర్క్‌షాపులో ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఏకైక కుమార్తె రమ్య లండన్‌లో ఉంటుంది. అమె నిర్ణయాన్ని ఉద్యోగులు, బంధువులు అభినందించారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తిరుమలగిరి జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం లాల్‌బజార్‌లో 96 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వం అన్నారు. సంక్షేమ పథకాలతో పాటు మహిళలను పారిశ్రామికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పం అన్నారు.